అధ్వాన రోడ్లతో అవస్థలు



కైలాస్‌నగర్: ఓల్డ్ హౌజింగ్‌బోర్డు కాలనీలోని రోడ్డు దుస్థితి



కైలాస్‌నగర్: గుంతలమయంగా టీచర్స్‌కాలనీలోని రోడ్డు

కైలాస్‌నగర్/ఇంద్రవెల్లి: ఆదిలాబాద్ పట్టణంలోని అంతర్గత రోడ్ల అధ్వానంగా మారాయి. మున్సిపల్ పరిధిలోని ఏ కాలనీలో చూసిన గుంతలమయమైన రోడ్లే దర్శనమిస్తున్నాయి. టీచర్స్‌కాలనీ, హౌజింగ్‌బోర్డు, విద్యానగర్, శాంతినగర్, భాగ్యనగర్, హమాలివాడ, రిక్షా కాలనీ, సంజయ్‌నగర్, ఖుర్షీద్‌నగర్ వంటి ప్రధాన కాలనీల్లో రోడ్ల పరిస్థితి దారణంగా తయారైంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్నాయి. అలాగే ఇంద్రవెల్లి మండలంలోని హీరపూర్, సుందర్ నగర్, భగత్‌సింగ్ గ్రామాల రోడ్లు బురదమయంగా మారాయి. దీంతో చిన్నవర్షానికి రోడ్లు చిత్తడిగా మారుతున్నాయి. ప్రజలు నడిచేందుకు కూడా ఇబ్బంది పడుతున్నారు. ప్రమాదాలు జరగకముందే అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.



ఇంద్రవెల్లి: హీరాపూర్‌లో

క్లుప్తంగా

తెలుగు భాష పరిరక్షణ అందరి బాధ్యత



మాట్లాడుతున్న జిల్లా కన్వీనర్ చిందం ఆశన్న

ఎదులాపురం: తెలుగు భాష పరిరక్షణ అందరి బాధ్యత అని తెలుగు భాషా అభ్యసనాభివృద్ధి సమితి జిల్లా కన్వీనర్ చిందం ఆశన్న అన్నారు. కాళోజీ నారాయణ జయంతిని పురస్కరించుకోని వినాయకచౌక్ సమీపంలోని శ్రీ సరస్వతి శిశుమందిర్‌లో శనివారం నిర్వహించిన తెలంగాణ భాషా దినోత్సవంలో పాల్గొన్నారు. ముందుగా కాళోజీ నారాయణ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వేణుగోపాల్, చరణ్ దాస్, పోచ్చన్న, మురళిధర్, రాజవర్ధన్, రంగాచార్య, నారాయణ గౌడ్ పాల్గొన్నారు.

బేల: మండల కేంద్రంలోని కీర్తన డిగ్రీ కళాశాలలో కాళోజీ నారాయణ జయంతి పురస్కరించుకుని శనివారం తెలంగాణ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వరప్రసాద్‌రావు, అధ్యాపకులు ప్రవీణ్, కిష్టరెడ్డి, అమోల్, సంజీవ్, బిందు, విజయ, సౌందర్య, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ అమలు చేస్తాం

ఆదిలాబాద్‌రూరల్: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ అమలు చేస్తామని డీసీసీ కార్యనిర్వాహక జిల్లా అధ్యక్షుడు భూపెల్లి శ్రీధర్ అన్నారు. శనివారం మావల మండలంలోని వాఘాపూర్ పరిధిలోని కొలాంగూడ గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. అర్హులైన ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు రూ. 6 లక్షల వ్యయంతో ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇవ్వడం జరుగుతుందన్నారు. దళితబంధు తరహాలో అంబేద్కర్ అభయహస్తం కింద అర్హులైన ప్రతి ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు రూ. 12 లక్షలు అందించడం జరుగుతుందన్నారు. ఎస్సీ, ఎస్టీ బ్యాక్ లాగ్ ఉద్యోగాలు భర్తీ చేయడం జరుగుతుందన్నారు. ఎస్టీల అభివృద్ధికి నాలుగు ఐటీడీఏలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు.

గ్రామాల్లో వైద్య శిబిరం

ఇంద్రవెల్లి: గ్రామాల్లో నిర్వహించే వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఇంద్రవెల్లి ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుడు శ్రీకాంత్ అన్నారు. శనివారం దేవాపూర్, దనోర(బి) గ్రామాల్లో వైద్య శిబిరం నిర్వహించారు. రోగులకు వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత శుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాస్, సిబ్బంది వినోద్, తిరుపతమ్మ, వందన పాల్గొన్నారు.

కార్యకర్తలే పార్టీకి బలం

ఉట్నూర్‌రూరల్: కార్యకర్తలే బీఆర్ఎస్ పార్టీకి బలమని బీఆర్ఎస్ నియోజకవర్గ అభ్యర్థి జాన్సన్ నాయక్ అన్నారు. శనివారం మండలంలోని సాలెవాడ(కె) శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉట్నూర్ హెచ్‌కేజీఎస్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఎల్లప్పుడు కార్యకర్తలకు అందుబాటులో ఉంటానని, ప్రతీ కార్యకర్త నిబద్ధతతో పని చేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. హస్నాపూర్ తీజ్ ఉత్సవాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కురిసిన వర్షం.. రైతుల హర్షం

తాంసి: తాంసి, భీంపూర్ మండలాల్లోని పలు గ్రామాల్లో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో మండల రైతులు హర్షం వ్యక్తం చేశారు. గత కొన్ని రోజులుగా సరైన వర్షాలు లేక పంటలు పూత, కాత దశలో వాడిపోయే దశకు చేరుకున్నాయి. పత్తి, సోయా, కంది పంటలు చేతికోస్తాయో లేదోనని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈక్రమంలో రెండు రోజులుగా తాంసి, భీంపూర్ మండలాల్లోని వర్షాలు కురవడంతో పంటలకు ప్రాణం పోసినట్లయిందని సంబురపడుతున్నారు.

హిందీ భాష ఔన్నత్యాన్ని చాటి చెప్పారు

ఎదులాపురం: దేశ భాష హిందీ ఔన్నత్యాన్ని ఉమ్మడి జిల్లాలో చాటి చెప్పిన గొప్ప వ్యక్తి, విద్య మార్తాండ్ అవార్డు గ్రహీత స్వర్గీయ ప్రకాష్ గౌడ్ అని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. పలువురు హిందీ పండితులు శనివారం ఎమ్మెల్యే జోగు రామన్నను ఆయన నివాసంలో కలిశారు. ఈనెల 16న జిల్లా కేంద్రంలోని జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించే కార్యక్రమానికి హాజరు కావాలని ఆహ్వానించారు. హిందీ భాషా సేవ సమితి అధ్యక్షుడు సుకుమార్ పెట్కులే, రవి జాబాడే, సాంబన్న శేండే, చంద్రశేఖర్ అంబేకర్, భాస్కర్ పాల్గొన్నారు.

పఠనాసక్తి పెంపొందించాలి



పిల్లలకు పుస్తకాల గురించి వివరిస్తున్న ప్రేమేందర్

ఎదులాపురం: పిల్లల్లో పఠనాసక్తి పెంపొందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. పట్టణంలోని కేఆర్‌కే కాలనీలో పొరెడ్డి అశోక్, వసుధ ఆధ్వర్యంలో విశ్రాంత ఉపాధ్యాయులు అవునూరి నారాయణ ఇంటివద్ద నిర్వహిస్తున్న పిల్లల గ్రంథాలయాన్ని శనివారం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. పిల్లల్లో ఫోన్ చూసే అలవాటు తగ్గించేందుకు ఇలాంటి గ్రంథాలయాలు ఎంతో దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఆనంద్, ఆశన్న, సాదుద్దిన్, ఉపాధ్యాయులు కృష్ణ కుమార్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

ఆదిలాబాద్: ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత లభిస్తుందని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమందర్ అన్నారు. ఆదిలాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని బంగారిగూడ కాలనీలో శనివారం బేడ బుడగ జంగం సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నగర భోజన కార్యక్రమానికి హాజరయ్యారు. హనుమాన్ చిత్రపటం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొని ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో చందన, బాలాజీ, చాంద్ పాషా, ఎల్లన్న పాల్గొన్నారు.

‘ప్రజా సంక్షేమాన్ని పట్టించుకోని ఎమ్మెల్యే’



ప్రెషర్ కుక్కర్ అందజేస్తున్న శ్రీనివాస రెడ్డి

కైలాస్‌నగర్: ప్రజా సంక్షేమాన్ని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న పట్టించుకోవడం లేదని కాంగ్రెస్ నాయకుడు కంది శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. శనివారం ఆదిలాబాద్ పట్టణంలోని భగత్ సింగ్‌నగర్, గాంధీనగర్, మహాలక్ష్మివాడ, నీరటివాడలో కేఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు ప్రెషర్ కుక్కర్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ హయాంలోనే పేదలకు ఇళ్ల స్థలాలు, ఇందిరమ్మ ఇల్లు పంపిణీ చేయడం జరిగిందన్నారు. బీఆర్ఎస్ హయాంలో డబుల్ బెడ్‌రూం ఇండ్లు ఎంతమందికి వచ్చాయని ప్రశ్నించారు. జోగు రామన్న మహారాష్ట్రలో వందల కోట్లు పెట్టి భూములు కొంటున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో సంతోష్, విట్టల్, కృష్ణరెడ్డి, సుజాత్ అలీ పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ.4వేల పెన్షన్

కైలాస్‌నగర్: ఎన్నికల్లో కార్యకర్తలు గెలుపే లక్ష్యంగా పని చేయాలని కాంగ్రెస్ నాయకుడు కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని ప్రజాసేవా భవన్‌లో న్యూహౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన పలువురు మహిళలు, భగత్‌సింగ్‌నగర్, అంబేద్కర్‌నగర్, చిల్కూరి లక్ష్మినగర్, తాటిగూడ, బంగారుగూడ, బేల మండలం సాంగిడికి చెందిన పలువురు కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో రాజు యాదవ్, ఎల్మా రాంరెడ్డి పాల్గొన్నారు.

‘హామీల అమలులో ప్రభుత్వం విఫలం’



పార్టీలోకి ఆహ్వానిస్తున్న పాయల్ శంకర్

ఆదిలాబాద్: బీఆర్ఎస్ ప్రభుత్వం హామీల అమలులో విఫలమైందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం బేల మండలంలోని పలాయి తండా గ్రామానికి చెందిన పలువురు బీజేపీలో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను ఇప్పటికీ నెరవేర్చలేదన్నారు. ఆదిలాబాద్ నియోజకవర్గంలో 9 ఏళ్లలో ఎటువంటి అభివృద్ధి జరగలేదని ఆరోపించారు. ఆదిలాబాద్ పట్టణ సుందరీకరణలో సైతం స్థానిక ప్రజాప్రతినిధులు విఫలమయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో ఆదిలాబాద్ జిల్లాలో బీజేపీ జెండా ఎగరడం ఖాయమన్నారు. కార్యక్రమంలో మురళీధర్ ఠాక్రే, రాందాస్, దయాకర్, రత్నాకర్ రెడ్డి, దినేష్, సురేశ్ పాల్గొన్నారు.

మావో సేటుంగ్ ఆశయాలు సాధించాలి

ఎదులాపురం: మార్క్సిస్టు మహా ఉపాధ్యాయుడు కామ్రేడ్ మావో సేటుంగ్ ఆశయాల సాధనకు కృషి చేయాలని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా జిల్లా ప్రధాన కార్యదర్శి జగన్‌సింగ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో శనివారం మావో సెటుంగ్ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన పోరాటాలను కొనియాడారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి అశోక్, సీపీఐ ఎంఎల్ నాయకులు విలాస్, సుంగు పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక

బేల: మండల కేంద్రంలోని శ్రీరామాలయం ప్రాంగణంలో శనివారం హిందూ ఉత్సవ సమితి మండల నూతన కార్యవర్గాన్ని జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా రాపెల్లి శివకుమార్, ప్రధాన కార్యదర్శిగా ముక్కవార్ కిరణ్, ఉపాధ్యక్షుడిగా గుండవార్ అకాష్, కార్యదర్శులుగా పారిక్ రాధేశ్యాం, గొరే విశాల్‌తో పాటు 9 మంది సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో హిందూ ఉత్సవ సమితి జిల్లా అధ్యక్షుడు రాళ్లబండి మహేందర్, బొంస్లే దశరత్ పటేల్, రాజులవార్ దత్తాత్రి, ఉప్పల నారాయణ, కడకుంట్ల కృష్ణ, బర్కాడే రాము, ఓం ప్రకాష్ పాల్గొన్నారు.

విశ్వహిందూ పరిషత్..

ఉట్నూర్‌రూరల్: విశ్వహిందు పరిషత్ ఉట్నూర్ డివిజన్, మండల కార్యవర్గాన్ని శనివారం జిల్లా అధ్యక్షుడు బొండ్ల నారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు మాదరి గంగాధర్‌ల ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. ఉట్నూర్ డివిజన్ అధ్యక్షుడిగా ఇందూరి రమేశ్, కార్యదర్శిగా కేంద్రే సంతోశ్, మండల అధ్యక్షుడిగా రామిని నాగన్న, ప్రధాన కార్యదర్శిగా ఏలేటి తిరుపతిరెడ్డి, కోశాధికారిగా మంథని శ్యాంసుందర్, ఉపాధ్యక్షుడిగా గట్ల సతీశ్, మరపాక రాజన్న, సహాయ కార్యదర్శులుగా గొల్లపల్లి శ్రీనివాస్, గుండా వెంకటేశ్వర్లు, పోచన్నలను ఎన్నుకున్నారు.

సంక్షిప్తం..

ఎమ్మెల్యే పరామర్శ

జైనథ్: మండలంలోని మాండగాడ గ్రామానికి చెందిన టక్కురి నారాయణ, సాంగ్వి గ్రామానికి చెందిన నేరెళ్ల పొచ్చక్క ఇటీవల మరణించడంతో, ఎమ్మెల్యే వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్‌లు తల్లెల చంద్రయ్య, వైస్ ఎంపీపీ సావాపూరే విజయ్ కుమార్, ముక్కెర ప్రభాకర్, మహేందర్‌రావ్, ప్రశాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు బీఆర్ఎస్ సభ

బోథ్: మండల కేంద్రంలోని పరిచయ గార్డెన్‌లో ఆదివారం ఎంపీపీ తుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ సభ నిర్వహించనున్నట్లు సర్పంచుల సంఘం అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు పెద్ద ఎత్తున బీఆర్ఎస్‌లో చేరుతున్నారని తెలిపారు. సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు హాజరు కావాలని కోరారు.

నేడు ఇచ్చోడకు అనిల్‌జాదవ్ రాక

ఇచ్చోడ: మండలంలోని అడేగామ(కె) గ్రామానికి బోథ్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి అనిల్‌జాదవ్ ఆదివారం ఉదయం 8 గంటలకు రానున్నట్లు ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి శనివారం తెలిపారు. అడేగామ(కె)లో హన్‌మాన్ ఆలయంలో అనిల్ జాదవ్ ప్రత్యేక పూజలు చేసి ఎస్సీ కాలనీలో పర్యటించనున్నట్లు పేర్కొన్నారు.

హనుమాన్ చాలీసా పారాయణం

బోథ్: మండల కేంద్రంలోని మార్కండేయ ఆలయంలో శనివారం సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. భక్తులు భక్తిశ్రద్ధలతో సామూహిక హనుమాన్ చాలీసా పారాయణంలో పాల్గొని 108 సార్లు చదివారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ

బోథ్: మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహ ఏర్పాటుకు శనివారం భూమిపూజ చేశారు. సర్పంచ్ సురేందర్, పద్మశాలి సభ్యులు మాట్లాడుతూ.. కొండా లక్ష్మణ్ బాపూజీ ఎంతో మందికి ఆదర్శమన్నారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు సదాశివ్, పట్టణ అధ్యక్షుడు మెరుగు భోజన్న, ప్రధాన కార్యదర్శి అనిల్, సిరిపురం చంద్రమోహన్, సురేందర్, వెంకటేష్, దయాకర్, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు

బోథ్: మండలంలోని నిగిని గ్రామం నుంచి కైలాస్‌టెకిడి శివాలయానికి రోడ్డు నిర్మాణం కోసం రూ. 12 కోట్ల 60 లక్షలు నిధులు మంజూరైనట్లు బోథ్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్ తెలిపారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంపై సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శనివారం రోడ్లు భవనాల శాఖ మంత్రి ప్రశాంత్ రెడ్డి సన్మానించారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

ఎదులాపురం: పౌష్టికాహారంతోనే ఆరోగ్యంగా ఉండవచ్చని వైద్యులు హజార్ అన్నారు. పట్టణంలోని వరలక్ష్మినగర్ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏడబ్ల్యూటీ జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీ విజయవంతం చేయండి

ఆదిలాబాద్‌రూరల్: మావల మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించే బైక్ ర్యాలీలో కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మావల మండల సీనియర్ నాయకుడు నల్ల రాజేశ్వర్ కోరారు. శనివారం మండల కేంద్రంలో చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. ర్యాలీకి ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్లు తెలిపారు.

రాములగుట్టపై పూజలు

తాంసి: మండలంలోని పాలోది గ్రామశివారులో గుట్టపై వెలిసిన శ్రీ సీతారామచంద్రుల స్వామికి భక్తులు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ప్రత్యేకంగా తయారుచేసిన నైవేద్యాన్ని సమర్పించారు. అనంతరం ఆలయంలో భజన చేశారు. కోనేరు నీటిని పంటచేలలో చల్లేందుకు తీసుకెళ్లారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శంకర్, సతీష్ రెడ్డి, నాగారెడ్డి పాల్గొన్నారు.

పోషకాహార మాసోత్సవం

బేల: మండలంలోని షంషాబాద్ గ్రామంలో శనివారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషకాహార మాసోత్సవం నిర్వహించారు. ఇందులో భాగంగా చిన్నారులకు వెల్‌బేబీ షోతో పాటు మహిళలకు వంటల పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన వారికి సర్పంచ్ కొడే విపిన్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు విశాఖ, జయ, వర్ష, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

ఆదిలాబాద్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం, ఆర్థికాభివృద్ధి కోసం ప్రవేశపెట్టిన పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ గంద్రత్ రమేశ్ అన్నారు. శనివారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని చిట్యాల్‌బోరిలో గిరిజన రైతులకు పోడుపట్టాల పంపిణీ కార్యక్రమానికి హాజరై పట్టాలు పంపిణీ చేశారు. అలాగే నూతనంగా రూ. 20 లక్షల వ్యయంతో నిర్మించనున్న గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. గత కొన్నేళ్ల నుంచి గిరిజనులు సాగు చేస్తున్న పోడు భూములకు ప్రభుత్వం పట్టాలు పంపిణీ చేసి వారికి రైతు బంధు, రైతుబీమా వర్తింప చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ జంగు, పీఏసీఎస్ చైర్మన్ పరమేశ్వర్, బీఆర్ఎస్ నాయకులు సెవ్వ జగదీష్, రాజు, ఎంపీడీవో లక్ష్మీకాంత్‌రావ్, ఎంపీడీవో దిలీప్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాకవి కాళోజీకి నివాళి



నివాళులర్పిస్తున్న అధికారులు

ఇంద్రవెల్లి: తెలంగాణలో సామాజిక రచనలు చేసి ప్రజలను చైతన్యం చేసిన ప్రజాకవి, సామాజిక ఉద్యమకారుడు కాళోజీ నారాయణరావ్ అని ఇంద్రవెల్లి గ్రంథాలయ శాఖ అధికారి కాంబ్లే వెంకటి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని గ్రంథాలయంలో ప్రజా కవి, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది బోడికే దళితానంద్, పవార్ అనిల్, మసురే భీంరావ్ పాల్గొన్నారు.

రాజీతోనే కేసుల పరిష్కారం



లోక్ అదాలత్ నిర్వహిస్తున్న జడ్జి దుర్గారాణి

ఉట్నూర్‌రూరల్: రాజీతోనే కేసులు పరిష్కారం అవుతాయని మండల న్యాయ సేవా సంస్థ చైర్మన్ దుర్గారాణి అన్నారు. శనివారం స్థానిక కోర్టులో లోక్ అదాలత్ నిర్వహించారు. సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న కేసులను సత్వర పరిష్కారానికి లోక్ అదాలత్ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇరు వర్గాల రాజీతోనే కేసులు పరిష్కరం సాధ్యం అవుతుందన్నారు. 624 కేసులు పరిష్కరించినట్లు జడ్జి తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

బోథ్: మండల కేంద్రంలోని జూనియర్ సివిల్ కోర్టు ప్రాంగణంలో శనివారం లోక్ అదాలత్ నిర్వహించారు. లోక్‌అదాలత్‌లో 1000 కేసులను పరిష్కరించారు. రాజీమార్గం ద్వారా 39, నేరం ఒప్పుకోవడం ద్వారా 67 కేసులు, ఎస్టీసీ కేసులు 888, ఎక్సైజ్ కేసులు 3, డీవీసీ 1, ఎంసీ కేసులు 2 పరిష్కరించినట్లు జడ్జి హుస్సేన్ తెలిపారు. కాగా బ్యాంకులకు సంబంధించి రూ. 22,98,000లు రికవరీ అయినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీపీ శ్రీధర్, బార్ అసోసియేషన్ కార్యదర్శి శంకర్, న్యాయవాదులు అంగద్ కేంద్రె, ఆడెపు హరీష్ కుమార్, కుమ్మరి విజయ్, విక్రమ్ సింగ్, జమీర్, రాములు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా తీజ్ ఉత్సవాలు



నేరడిగొండ: కేజీబీవీలో విద్యార్థినుల సందడి

ఉట్నూర్‌రూరల్: మండలంలోని హస్నాపూర్‌లో నిర్వహించిన తీజ్ ముగింపు ఉత్సవాల్లో జెడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్ పాల్గొన్నారు. శనివారం శ్రీజగదాంబ దేవి సేవాలాల్ మహరాజ్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. జెడ్పీచైర్మన్ మాట్లాడుతూ.. బంజారా సమాజంలో పవిత్రమైన పండుగ తీజ్ అని, సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో మోతీలాల్, ఆడే ప్రకాశ్, రాంజీ, ప్రేంసింగ్, స్వరాజ్, సంతోశ్, రమేశ్ పాల్గొన్నారు.

నేరడిగొండ: కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాల, కళాశాలలో తీజ్ ఉత్సవాలు నిర్వహించడం అభినందనీయమని ఎంపీపీ రాథోడ్ సజన్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ పాఠశాలలో నిర్వహించిన తీజ్ ఉత్సవాలలో పాల్గొన్నారు. సాంప్రదాయబద్ధంగా విద్యార్థినులు నాటిన గోధుమలకు ప్రత్యేక పూజలు చేసి, నృత్యం చేశారు. అనంతరం వాగులో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ఏలేటి రవీందర్ రెడ్డి, డీఎంసీ మాజీ చైర్మన్ దావుల భోజన్న, ఎస్‌వో రజిత పాల్గొన్నారు.



బోథ్: తీజ్ సంబురాల్లో విద్యార్థినులు

బోథ్: మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో శనివారం తీజ్ ఉత్సాలను నిర్వహించారు. విద్యార్థినులు సాంప్రదాయబద్ధంగా చేసిన నృత్యం ఆకట్టుకుంది. పాఠశాల ప్రత్యేకాధికారిణి రాథోడ్ వలిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శిక్షణలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

కైలాస్‌నగర్: రానున్న ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ జిల్లా, బ్లాక్, మండల కమిటీలు, అనుబంధ సంఘాల జిల్లా కమిటీలకు శనివారం హైదరాబాద్‌లో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. బూత్‌స్థాయిలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలన్నారు. డీసీసీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్, ఏఐసీసీ కార్యదర్శి నరేశ్ జాదవ్, అడే గజేందర్, అల్లూరి సంజీవ్‌రెడ్డి, కుంరం కోటేశ్వర్ పాల్గొన్నారు.

నేరడిగొండ: జిల్లా అధ్యక్షుడు సాజిద్ ఖాన్ ఆధ్వర్యంలో హైదరాబాదులో శనివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. హాజరైన వారిలో కాంగ్రెస్ నాయకులు ఆడె గజేందర్, బోథ్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రఫుల్ చందర్‌రెడ్డి, ఇచ్చోడ కాంగ్రెస్ అధ్యక్షుడు బ్లాక్ అధ్యక్షుడు మహిముద్ ఖాన్, ఆడే వసంత్, మహేందర్, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌రూరల్: హైదరాబాద్‌లో శనివారం నిర్వహించిన తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ శిక్షణ శిబిరానికి ఆదిలాబాద్ రూరల్, మావల మండలాలకు చెందిన నాయకులు తరలివెళ్లారు. కాంగ్రెస్‌ను క్షేత్రస్థాయిలో బలోపేతం చేసే అంశాలపై శిక్షణ శిబిరంలో అవగాహన కల్పించడం జరిగిందని నాయకులు తెలిపారు.